## ఎమ్మెల్యే 'బండారి'కి కృతజ్ఞతలు

రామంతాపూర్ ,జూన్ 12: రామంతాపూర్ భగాయత్‌లో వెంకటసాయినగర్‌కాలనీలో ఆలయానికి వచ్చే భక్తులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని కాలనీకి ఒక బాక్స్ కల్వర్టు నిర్మాణం చేయించాలని ఎమ్మెల్యే దృష్టికి కాలనీ వాసులు తీసుకురాగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే స్వయంగా జోనల్ కమిషనర్ గురువారం కలిసి కాలనీ వాసుల సమస్యను వివరించి రూ.34.50 లక్షలతో బాక్స్ కల్వర్టును మంజూరు చేయించారు. సమస్యను తీర్చినందుకు ఎమ్మెల్యేకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

## అర్జీలను వెంటనే పరిష్కరించాలి



అర్జీదారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి

మేడ్చల్, జూన్ 12 : భూ సమస్యలపై వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి రెవెన్యూ అధికారులకు సూచించారు. మేడ్చల్ మండలంలోని శ్రీరంగవరం, అత్వెల్లి గ్రామాల్లో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ సునీల్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి



టెంపుల్ అల్వాల్ రాజీవ్ వీకర్ సెక్షన్ స్థానికులతో ఇందిరమ్మ ఇండ్ల పై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి

మల్కాజిగిరి, జూన్ 12: పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం టెంపుల్ అల్వాల్‌లోని రాజు వీకర్ సెక్షన్‌లో ఇందిరమ్మ ఇండ్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి మదన్మోహన్, సూపర్ ఇంటెండెంట్ స్వామి పాల్గొన్నారు.

## జడ్సీకి కార్పొరేటర్ వినతి




జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ చేతన.

రామంతాపూర్:హబ్సిగూడ డివిజన్‌లోని పెద్ద చెరువు సుందరీకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరుతూ గురువారం కార్పొరేటర్ కక్కిరేని చేతన హరీష్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ను గురువారం కలిసి వినతి పత్రం ఇచ్చారు. కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే అన్ని పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు.



మేడ్చల్: విద్యార్థులకు యూనిఫాంలను పంపిణీ చేస్తున్న కమిషనర్ నాగిరెడ్డి



చర్లపల్లి: కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బాపురెడ్డి



శామీర్‌పేట: లాల్‌గడి మలక్‌పేటలో బడిబాటలో పాల్గొన్న డీఈవో విజయకుమారి, ఎంఈవో కమలాకర్.

# సర్కారు బడుల్లో సౌకర్యాల కల్పనకు కృషి

- ప్రారంభమైన పాఠశాలలు
- మొదటిరోజు ఉత్సాహంగా బడికివెళ్లిన విద్యార్థులు
- పలుచోట్ల యూనిఫామ్స్, పుస్తకాలు పంపిణీ
- పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

జోన్‌బృందం: పండుగ వాతావరణంలో గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలకు సుదీర్ఘ విరామం తర్వాత తిరిగి వచ్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. పాఠశాల గేట్ వద్ద స్వాగ తం పలికి లోనికి ఆహ్వానించారు. పాఠశాలల ద్వారం వద్ద, నోటీ సు బోర్డు వెల్‌కం బ్యాక్ టూ స్కూల్ పేరుతో అందంగా అలంకరించారు. విద్యార్థులను ఆకర్షించాయి. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మొదటి రోజు పుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేశారు. కుషాయిగూడ జడ్పీ పరిషత్ పాఠశాల, మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ తిరుమలానగర్ ప్రభుత్వ పాఠశాల, మండల పరిషత్ ప్రైమరీ స్కూల్, చిలకానగర్‌లో పాఠశాలల్లో విద్యార్థులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పనకు కృషి చేస్తానని పేర్కొన్నారు.



ఘట్‌కేసర్: ఈడబ్ల్యూఎస్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మాధవరెడ్డి



కాప్రా: తిరుమలనగర్ పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జే.ప్రభుదాస్



రామంతాపూర్: జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి.



ఘట్‌కేసర్ పట్టణంలోని జడ్పీ పాఠశాలలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పావనీజంగయ్య యాదవ్




శామీర్‌పేట: పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణ, తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకట్ గోపాల్.



శామీర్‌పేట: అలియాబాద్‌లో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న కమిషనర్ చంద్రశేఖర్, అధికారులు.



మేడ్చల్ కలెక్టరేట్: రాంపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు,యూనిఫాం అందజేస్తున్న ఎంఈఓ జమదగ్ని, ఉపాధ్యాయులు



నాచారంలో పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్



చిలుకానగర్ ప్రభుత్వ పాఠశాలలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ బన్నాల



శామీర్‌పేట:మూడుచింతలపల్లి మున్సిపాలిటీలో బడిబాటలో ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటుతున్న కమిషనర్ పవన్‌కుమార్.



మేడ్చల్ కలెక్టరేట్: నాగారంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు,యూనిఫామ్‌లు అందజేస్తున్నా మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయులు, స్థానిక నాయకులు



మేడ్చల్ కలెక్టరేట్: గోధుమకుంట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందిస్తున్న మాజీ ఎంపీటీసీ మంచాల కిరణ్ జ్యోతి ప్రవీణ్, ఉపాధ్యాయులు



కాప్రా: విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్



కాప్రా: మల్లాపూర్ డివిజన్‌లో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి తదితరులు

## వృత్తి నైపుణ్యం పెంపునకు శిక్షణతరగతులు



108 సిబ్బంది శిక్షణలో మాట్లాడుతున్న మేడ్చల్ , హైదరాబాద్ జిల్లాల ఉమ్మడి ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్

శామీర్‌పేట/మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 12 : 108 సిబ్బంది వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని మేడ్చల్,హైద్రాబాద్ జిల్లాల ఉమ్మడి ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో 108 సిబ్బందికి రెండు రోజుల పాటు నిర్వహించిన రిఫ్రెష్ శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది నైపుణ్యంతో పనిచేస్తూ ఎప్పటికప్పుడు బాధితులకు నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు.పలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా 108 కో-ఆర్డినేటర్ తిరుపతి, మేడ్చల్, హైదరబాద్ జిల్లాలోని 108ఉద్యోగులు,సిబ్బంది,ఉన్నారు.

## ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలి



డిపో ఆవరణలో మొక్కలు నాటుతున్న రీజినల్ మేనేజర్ సుచిత

మేడ్చల్,జూన్ 12: మేడ్చల్ ఆర్టీసీ డిపోను నూతనంగా బాధ్యతలు చేపట్టిన సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ సుచరిత గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె డిపో లో మొక్కలు నాటి, మేడ్చల్ పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటి రీజినల్ మేనేజర్ అపర్ణ కల్యాణి, డిపో మేనేజర్ సుధాకర్, సూపర్‌వైజర్లు, సిబ్బంది ఉన్నారు.

## భర్త కళ్లెదుటే భార్య ఆత్మహత్య

పీర్జాదిగూడ జూన్ 12: భర్త కళ్లెదుటే భార్య ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం .. నగరంలోని అంబర్‌పేట పటేల్ నగర్‌కు చెందిన సంతోష్, దీపిక రెండు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఒక బాబు. సంతోష్ మద్యంకు బానిసై భార్యతో తరచూ గొడవపడేవాడు. అది భరించలేని దీపిక తన బాబుని తీసుకొని బోడుప్పల్‌లో తన తల్లిదండ్రుల వద్దకు వచ్చి ఉంటుంది. బుధవారం సంతోష్ తన ఇంటికి తీసుకువెళ్లడానికి దీపిక వద్దకు వచ్చాడు. రాత్రి వీరిద్దరి మధ్య మళ్లీ గొడవ జరిగింది.

సంతోష్ కోపంతో తన పక్కనే ఉన్న బ్లేడ్‌తో చెయ్యి కోసుకుని తనపై తాను దాడి చేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. భయాందోళనకు గురైన దీపిక గదిలోకి వెళ్లి ఫ్యానుకు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది.

భార్య ఉరేసుకోవడం చూసిన భర్త కాపాడలేక పోయి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. భార్య మృతి చెందగా, సంతోష్‌ను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# బాల కార్మికులు లేని సమాజాన్ని నిర్మిద్దాం




జవహర్‌నగర్: ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆశ్రయ స్వచ్ఛంద సంస్థ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ

జవహర్‌నగర్, జూన్ 12: బాలకార్మికులు లేని సమాజ నిర్మిద్దామని జిల్లా జడ్జి కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ బాలకార్మికుల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జవహర్‌నగర్ కార్పొరేషన్ ప్రభుత్వఉన్నత పాఠశాలలో ఆశ్రయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యయుడు అజా మొహినుద్ధీన్ సమక్షంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా జడ్జి కిరణ్‌కుమార్ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని పేర్కొన్నారు. శ్రయ స్వచ్ఛంధ సంస్థ బాలకార్మికులు లేని సమాజానికి కృషి చేయడం అభినందనీయమన్నారు.పాఠశాల పిల్లలతో కలిసి కాలనీల్లో ర్యాలీలు, ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలకు పుస్తకాలు, నోట్ బుక్స్, దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాల రక్షక్ కోఆర్డినేటర్ తిరుమలాదేవి, అరుణ్, సతీష్, శ్రావణ్, హరిభూషణ్, క్రాంతి, రమేష్, స్వప్న, సరిత తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్ : ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బాల సంఘం, ఏఐవైఎఫ్ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ మల్లాపూర్ లోని ప్రభుత్వ పాఠశాలలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం - భావి భారత పౌరులు ఉండాల్సింది పనిలో కాదు బడిలో అనే నినాదంతో చిన్నారులతో కలిసి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

# అత్తను చంపిన అల్లుడు అరెస్ట్



నిందితుడిని అదుపులోకి తీసుకొని వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఘట్ కేసర్,జూన్ 12:సెల్‌ఫోన్ దొంగిలించి అమ్ముకున్నావని నిలదీసిన అత్తను హత్యచేసిన అల్లుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం నిర్వహించిన సమావేశం లో ఇన్‌స్పెక్టర్ పరశురాం వివరా లు వెల్లడించారు. మైసమ్మగుట్ట కాలనీలో మంజుల బుజ్జమ్మ(48) భర్త స్థానికంగా లేకపోవటంతో చిన్న కూతురుతో కలిసి గుడిసెలో నివాసం ఉంటుంది. పక్కనే ఆమె రెండో కూతురు, అల్లుడు శాతోలు దొరబాబు నివాసం ఉంటున్నారు. వారం క్రితం ఆమె చిన్న కూతురు ఫోన్ ను అల్లుడు దొరబాబు దొంగిలించి అమ్ముకున్నాడు. వచ్చిన డబ్బులను ఏం చేశావని అత్త నిలదీసి అడుగుతుండడంతో కోపం పెంచుతున్నాడు. మంగళవారం సాయంత్రం రెండో కూతురు, చిన్న కూతురు వరంగల్ లోని చర్చికి వెళ్లారు. అదే అదునుగా భావించిన అల్లుడు ఉదయం నాలుగు గంటలకు అత్త నివసిస్తున్న గుడిసెలోకి వెళ్లి గాఢనిద్రలో ఉన్న అత్త ముఖంపై దిండు అదిమిపెట్టి హత్యాయత్నం చేయగా కొన ఊపిరితో కదులుతుండడంతో గొంతు నులిమి హత్య చేశాడు. అదే రోజు ఉదయం ఇంటికి చేరుకున్న రెండో కూతురు, చిన్న కూతురు తల్లి మృతి చెందడాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుడు అల్లుడే అని తేల్చారు. గురువారం ఉదయం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. కేసు ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్సైలు ప్రభాకర్ రెడ్డి, శేఖర్, కానిస్టేబుల్‌ను అభినందించారు.

## క్వారీ గుంతలో పడి చిన్నారులు మృతి




దుర్గాప్రసాద్, సుబ్రమణ్యం(ఫైల్)

జవహర్‌నగర్, జూన్ 12: క్వారీ గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి అరుంధతి నగర్‌లో జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. అరుంధతినగర్‌లో నివసిస్తున్న యాదమ్మ ఇటీవల అనారోగ్యానికి గురైంది. కౌకూర్ భరత్‌నగర్‌కు చెందిన స్వాతి, గుంటూరు జిల్లా చంద్రాసిపల్లిలో ఉంటున్న అంజమ్మకు పెదమ్మ అయిన యాదమ్మను చూడటానికి రాగా వారి కుటుంబాల్లో తీవ్రవిషా దం మిగిలింది. బుధవారం మధ్యాహ్నం దుర్గాప్రసాద్(11), సుబ్రమణ్యం(8) ఇద్దరు చిన్నారులు బండబావి వద్ద క్వారీ గుంత వద్దకు ఆడుకోవడానికి వెళ్లి నీటిలో మునిగి చనిపోయారు. దీంతో జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరు చిన్నారులు అదృశ్యమయ్యారని గురువారం కేసు నమోదైందని పోలీసులు తెలిపారు. గురువారం ఇద్దరు చిన్నారులు బండబావి క్వారీ గుంతలో శవమై తేలారని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అరుంధతినగర్‌లో అదృశ్యమైన ఇద్దరు చిన్నారులు వీరే అని తెలిసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు..నగదు స్వాధీనం

పీర్జాదిగూడ జూన్ 12 : ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్న ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీరామ్ కుటీర్‌లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం అందుకున్న మేడిపల్లి పోలీసులు గురువారం ఆ ఇంటిపై దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న బోడుప్పల్ ఉప్పల్‌తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ1,38,880 నగదు, 9 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## నేడు డయల్ యువర్ డీఎం

బోడుప్పల్/మేడ్చల్: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం, సమస్యల సత్వర పరిష్కారంగా శుక్రవారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డయల్ యువర్ డిపో మేనేజర్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు మేడ్చల్, చెంగిచెర్ల డిపో డీఎంలు సుధాకర్, కే. కవిత ఒక ప్రకటనలో తెలిపారు. మేడ్చల్ డీఎం 9959226152 నంబర్‌కు , చెంగిచెర్ల డిపో మేనేజర్ సెల్ 78930 88433 నెంబర్ ను సంప్రదించాలని ఆమె కోరారు.

## విమానప్రమాదంపై ఎమ్మెల్యే 'బండారి' దిగ్భ్రాంతి

కాప్రా, జూన్ 12:గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఘోరవిమానప్రమాదంపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తీవ్రవిచారం వ్యక్తం చేశారు. దుర్ఘటనలో తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే కోరారు. విమానప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన దేవున్ని ప్రార్థించారు

## 17 నుంచి రాష్ట్ర క్రీడాపాఠశాలలో మండల స్థాయి సెలక్షన్స్

శామీర్‌పేట, జూన్ 12: తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు మండల స్థాయి సెలక్షన్స్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవోలు కమలాకర్, భాగ్యమణి కోరారు. విద్యార్థులు ఈనెల 15 లోపు ఆన్‌లైన్ tgss.telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆధార్ కార్డు, బోనోఫైడ్ సర్టిఫికేట్, పుట్టిన తేదీ ధ్రువపత్రం, 3వ తరగతి ప్రోగ్రెస్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ప్రస్తుత పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు ఉండాలన్నారు.17న ఉదయం 9:30 గంటలకు శామీర్‌పేట మినీ స్టేడియంలో హాజరుకావాలని కోరారు. మూడుచింతలపల్లి మండల స్థాయి పోటీల్లో పాల్గొనే వారు ఈనెల 18న మూడుచింతలపల్లి మినీ స్టేడియంలో ఉదయం హాజరు కావాలని కోరారు. వివరాలకు 917416542451,91801960764 ఫోన్‌చేయాలని కోరారు.

## 30 వరకు రేషన్ బియ్యం పంపిణీ

మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 12: రేషన్ షాపుల్లో ఈనెల 30వ తేదీ వరకు సన్న బియ్యం పంపిణీ కొనసాగుతుందని పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ఎల్.సుగుణ బాయి ఒక ప్రకటనలో తెలిపారు. 3 నెలల స్టాక్ అందుబాటులో ఉందని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో చౌక ధరల దుకాణాలు తెరిచి ఉంటాయని వివరించారు. జిల్లాలో ఉన్న రేషన్ కార్డుదారులకు దాదాపు 68 శాతం మూడు నెలల రేషన్ సరుకులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్డు దారులు రేషన్ బియ్యాన్ని ఎవరికైనా విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చ రించారు.బియ్యం విక్రయించిన వారు పట్టుబడితే కార్డును రద్దు చేయడంతో పాటు వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

## భూగర్భ డ్రైనేజీ పనుల్లో నాణ్యత పాటించాలి

బాలానగర్: భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనుల్లో నాణ్యత పాటించాలని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని కళ్యాణ్‌నగర్ లో జరుగుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళ్యాణినగ ర్‌లో డ్రైనేజీ సమస్య తలెత్తడంతో నూతన పైప్‌లైన్ పనులకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేస్తున్నట్లు ఆయన తెలిపారు. డివిజన్ పరిధిలో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మనోహర్ రెడ్డి, శంకర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, జక్కా శ్రీనివాస్, సిద్ధిరాములు, సందీప్, రిషి యాదవ్, చంద్రశేఖర్, బాలరాజ్, నరేశ్ పాల్గొన్నారు.